
సాక్షి పల్నాడు

సోమవారం । 3 । ఫిబ్రవరి । 2025




గాయత్రీ మహాయజ్ఞం

కుందురువారిపాలెం(ముప్పాళ్ల): మండలంలోని కుందురువారిపాలెంలో శ్రీ సాందీపని ఆశ్రమ వార్షికోత్సవం, వసంత పంచమిని పురస్కరించుకొని గాయత్రీ మహాయజ్ఞం జరిగింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 551.00 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 10,500 క్యూసెక్కులు వదిలారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 1818, హై లెవల్ కాలువకు 76 క్యూసెక్కులు విడుదల చేశారు.

న్యూస్‌రీల్

ఎమ్మెల్సీ ఎన్నికలు అయ్యేవరకు పీజీఆర్ఎస్ రద్దు

నరసరావుపేట: ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను ఎమ్మెల్సీ ఎన్నికలు పూర్తయ్యేంత వరకు రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి కృష్ణా–గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి జిల్లాలో అమలులోకి వచ్చిందన్నారు. ఈ మేరకు పీజీఆర్ఎస్‌ను రద్దు చేసినట్లు వెల్లడించారు.

ఎస్పీ కార్యాలయంలో...

నరసరావుపేట: ఎమ్మెల్సీ ఎన్నికలు పూర్తయ్యే వరకూ ప్రతి సోమవారం జిల్లా ఎస్పీ ఆఫీసులో నిర్వహించే 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' రద్దు చేసినట్లు ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

విజయకీలాద్రి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రం వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో 8వ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు శ్రీ వేంకటేశ్వరస్వామికి అభిషేకం, నక్షత్ర హారతి, సాయంత్రం ఆరు గంటలకు రక్షా బంధనం, మృత్సంగ్రహణ అంకురారోపణ, ఋత్విక్ వరణ కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాల్లో మొదటి రోజు ఘనంగా ముగిసిందని వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించి, తీర్థప్రసాదాలు స్వీకరించారని తెలిపారు.

దీక్షలు ప్రారంభం



మంగళగిరి (తాడేపల్లి రూరల్): మంగళగిరి పట్టణంలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఆదివారం మాలధారణ దీక్షలు ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకులు మాల్యవంతం శ్రీనివాస దీక్షితులు దీక్షాధారులకు మాలలు వేశారు. ఆయన మాట్లాడుతూ ఆదివారం నుంచి మండల దీక్షను, ఈనెల 22నుంచి అర్ధమండల, మార్చి 4 నుంచి ఏకాదశ మాల దీక్షలు ఉంటాయని వివరించారు. అనంతరం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో దీక్షాధారులకు వస్త్రాలను ఉచితంగా అందజేశారు.

దుర్గమ్మకు బంగారు సూత్రాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు భక్తులు రూ.10 లక్షల విలువ కలిగిన బంగారు మంగళసూత్రాలు, తాడును ఆదివారం కానుకగా సమర్పించారు. విజయవాడ గుణదలకు చెందిన చింతలపట్టి మల్లికార్జునరావు కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఆలయ అధికారులను కలిసిన దాతలు 120 గ్రాముల బంగారంతో తయారు చేసిన గొలుసు, రెండు మంగళ సూత్రాలను ఆలయ డీఈఓ రత్నరాజుకు అందజేశారు.

తాడేపల్లిలో ఎస్పీ పర్యటన

తాడేపల్లి రూరల్: తాడేపల్లిలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదివారం విస్తృతంగా పర్యటించారు. ఉండవల్లి అమరావతి కరకట్ట వెంబడి నివాసముంటున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భద్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అధికారులతో చర్చించారు. ఉండవల్లి నుంచి ఆత్మకూరు పార్టీ కార్యాలయం వరకు ముఖ్య కూడళ్లను పరిశీలించారు. ప్రకాశం బ్యారేజ్ బకింగ్ హామ్ కెనాల్ బ్రిడ్జి వద్ద, కేఎల్‌రావు కాలనీ రోడ్డుకు ఇరువైపులా, సీతానగరం రేవేంద్రపాడు రహదారి, భరతమాత సెంటర్, ఓల్డ్ టోల్‌గేట్ వద్ద, పాతూరు అండర్‌పాస్ రహదారి, కుంచనపల్లి బకింగ్ హామ్ కెనాల్ బ్రిడ్జి తదితర ప్రాంతాలను పరిశీలించారు. బారికేడ్ల ఏర్పాటుతో పాటు ముఖ్యమంత్రి ఆత్మకూరు పార్టీ కార్యాలయానికి వెళ్లే సమయంలో తగిన భారీ భద్రత ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను సూచించారు.

రోడ్డు ప్రమాదాలు ఇటీవల కాలంలో పెరుగుతున్నాయి. అతివేగమే దీనికి కారణం. ప్రమాదాలు జరిగితే చుట్టుపక్కల వారు వచ్చినా ఆ దృశ్యాలను సెల్‌ఫోన్‌లో బంధించడానికి పోటీ పడుతున్నారే గానీ, గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించేందుకు ముందుకు రావడం లేదు. ఇది గుర్తించిన కేంద్ర ప్రభుత్వం గుడ్ సమరిటన్ చట్టాన్ని ప్రవేశపెట్టింది. ఇది అమల్లోకి వచ్చి మూడేళ్లు అవుతున్నా ప్రజలకు ఇంకా పూర్తిస్థాయిలో అవగాహన లేదు. ఇలా సాయం చేసే వారికి ఇచ్చే నజరానాను రూ.5 వేల నుంచి రూ.25 వేలకు పెంచడం ద్వారా నిండు ప్రాణాలను నిలిపేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేసింది.

మీ సాయం... ఓ నిండు ప్రాణం!



గత నెల 25న వినుకొండలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రుడికి సాయం చేస్తున్న అమృతపు గణేష్

- ప్రమాద క్షతగాత్రులను ఆసుపత్రిలో చేరిస్తే నజరానా
- రహదారి ప్రమాదాలు తగ్గించేందుకు గుడ్ సమరిటన్ చట్టం
- రూ. 5 వేల నుంచి రూ. 25 వేలకు బహుమానం పెంపు

సత్తెనపల్లి: మన కళ్లముందే రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయి. ఈ ప్రమాదాల్లో అనేకమంది తీవ్రంగా గాయపడి కొనఊపిరితో కొట్టుమిట్టాడుతూ ఉంటారు. అటువంటి సందర్భాల్లో క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించేందుకు చాలామంది ఆలోచిస్తారు. పోలీసులు, కేసుల భయంతో వెనకడుగు వేస్తారు. ఈ పరిస్థితులను గుర్తించి కేంద్ర ప్రభుత్వం 2021 అక్టోబర్ గుడ్ సమరిటన్ చట్టాన్ని తీసుకొచ్చింది. క్షతగాత్రులను తక్షణం ఆసుపత్రికి తరలించి వారి ప్రాణాలు నిలబడేలా చేస్తే వారికి రూ. 5 వేలు ప్రోత్సాహకాన్ని అందిస్తోంది. ఇప్పుడు ఆ ప్రోత్సాహకాన్ని రూ. 25 వేలకు కేంద్ర ప్రభుత్వం పెంచింది.

వెంటనే సమాచారం ఇస్తే..

ప్రాణాపాయంలో ఉన్న వారిని ఆసుపత్రికి తీసుకెళ్లాక సంబంధిత స్టేషన్లకు సమాచారం ఇస్తే పోలీసులు అధికారికంగా లేఖ ఇస్తారు. సమరిటన్‌లు గుర్తింపు కార్డు, చిరునామా, బ్యాంకు ఖాతా, పోలీస్ శాఖ ధ్రువీకరణ పత్రం, ఆసుపత్రి ధ్రువీకరణ పత్రాన్ని జతపరిచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. రవాణా, రెవెన్యూ, పోలీస్, జాతీయ రహదారుల సంస్థ, రహదారులు భవనాల శాఖ, వైద్య, తదితర శాఖల అధికారులతో కూడిన కమిటీ గుడ్ సమరిటన్‌ను గుర్తించి నగదు ప్రోత్సాహకానికి ఎంపిక చేస్తుంది.

ఏడాదిలో ఐదు సార్లు అందుకోవచ్చు...

ప్రమాదాల్లో గాయపడిన వారిని వెంటనే గుర్తించి మొదటి గంటలోగా దగ్గరలోని ఆసుపత్రికి తరలిస్తే ప్రాణాలు నిలబెట్టవచ్చు. ఎంతో కీలకమైన ఆ గంటను గోల్డెన్ అవర్ అని పిలుస్తారు. ఇలా ప్రాణాలు కాపాడే వారికి రూ. 5 వేలు ఇస్తారు. దీనిని రూ. 25 వేలు చేయనున్నట్లు కేంద్ర మంత్రి గడ్కరీ ఇటీవల ప్రకటించారు. ఇలా ఏడాదిలో ఐదుసార్లు ఓ వ్యక్తి ప్రోత్సాహకాన్ని అందుకోవచ్చు. కాపాడిన వారి వ్యక్తిగత వివరాలు ఎవరికీ చెప్పాల్సిన పని లేదు. డబ్బు ఖర్చు చేయాల్సిన పనిలేదు. ఆసుపత్రిలో చేర్పించి వెళ్లిపోవచ్చు. ఇతరుల నుంచి బెదిరింపులు రాకుండా ఒక కమిటీ రక్షణ కూడా కల్పిస్తుంది. ఏడాదిలో ఎక్కువ మందిని కాపాడిన 10 మందిని ఎంపిక చేసి ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున నగదు బహుమతి అందజేస్తారు.

స్పందిస్తున్న గణేష్....

గుడ్ సమరిటన్ చట్టం గురించి తెలుసుకున్న పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన యువకుడు అమృతపు గణేష్ ప్రమాదాల సమయంలో వెంటనే స్పందిస్తున్నారు. తాను ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నప్పటికీ తన కళ్ల ముందు ఏ ప్రమాదం జరిగినా వెంటనే సమయాన్ని వృథా చేయకుండా క్షతగాత్రులను వైద్యశాలల్లో చేర్పించి ప్రాణాలు కాపాడుతున్నారు. యువత ప్రమాద సమయంలో ఫొటోలకు ప్రాధాన్యం ఇవ్వకుండా వెంటనే స్పందిస్తే ఎక్కువ మందిని కాపాడవచ్చు.

ఎటువంటి ఇబ్బందులు ఉండవు



రహదారి ప్రమాదాలకు గురై ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న వారిని ఆసుపత్రికి తీసుకెళ్తే ఎటువంటి ఇబ్బందులు ఉండవు. కొన ఊపిరితో ఉన్న వారిని ఘటన జరిగిన గంటలోపు ఆసుపత్రులకు తీసుకెళ్లి ప్రాణాలను కాపాడితే మేలు చేసిన వారవుతారు. పోలీసులు వేధిస్తారనే అపోహల్ని వీడండి. సాయం చేసి ప్రోత్సాహకాలు అందుకోండి.

– పోలూరి శ్రీనివాసరావు, ఎస్‌హెచ్ఓ, సత్తెనపల్లి రూరల్

పోలీసులమని భయపెట్టి ఆన్‌లైన్‌లో దోపిడీ


- రూ. 24 లక్షలు పంపిన వృద్ధుడు
- మోసమని తేలడంతో పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

పట్నంబజారు: ఉమెన్ ట్రాఫికింగ్‌కు పాల్పడే వ్యక్తి వద్ద నీ ఆధార్ ఉందని.. డబ్బులు కట్టకుంటే అరెస్ట్ చేస్తామని వాట్సాప్ కాల్ ద్వారా భయపెట్టడంతో వ్యక్తి ఏకంగా రూ.24 లక్షలు వారికి పంపిన ఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెహ్రూ నగర్‌కు చెందిన వంకాయల నాగేశ్వరరావు (65) పురుగు మందుల వ్యాపారం చేసి ప్రస్తుతం ఇంట్లోనే ఉంటున్నారు. ఈ క్రమంలో జనవరి 28న వాట్సాప్ ఫోన్ కాల్ వచ్చింది. తాను బెంగళూరు పోలీసునని, పేరు శివప్రసాద్ అని, తాము ఉమెన్ ట్రాఫికింగ్‌కు పాల్పడుతున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని తెలిపాడు. ఆ వ్యక్తి వాడుతున్న సిమ్‌కార్డు మీ పేరుతో ఉందని, దీంతోపాటు అతడు రూ. 30 లక్షలు ఇచ్చినట్లు చెబుతున్నాడని మాయ మాటలు చెప్పాడు. ఆ డబ్బులు కట్టకుంటే అరెస్ట్ చేస్తామని నాగేశ్వరరావును భయభ్రాంతులకు గురి చేశారు. దీంతో బాధితుడు భయపడి దఫాలవారీగా తన బ్యాంకు అకౌంట్ల నుంచి ఆర్‌టీజీఎస్ ద్వారా రూ. 24 లక్షలు పంపించాడు. అయినప్పటికీ సైబర్ నేరగాళ్లు ఇంకా డబ్బులు పంపాలని డిమాండ్ చేస్తుండటంతో విషయాన్ని నాగేశ్వరరావు కుటుంబసభ్యుల దృష్టికి తీసుకుని వెళ్లాడు. దీంతో ఆదివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మాఘమాసం సందడి.. భక్తుల తాకిడి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై మాఘ మాసం సందడి ప్రారంభమైంది. శుభ ముహూర్తాల వేళ ఒక్కటైన నూతన వధూవరులు, వారి బంధువులతో పాటు భక్తులు, ఉభయదాతలు ఆది దంపతులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తెల్లవారుజామున అమ్మవారి సుప్రభాత సేవ అనంతరం వస్త్రాలంకరణ సేవ జరిగింది.

విశ్వాసంతో ప్రార్థిస్తే కష్టాలు దూరం



విద్యుత్ దీపాలతో వెలుగులీనుతున్న కానుకమాత చర్చి

రెంటచింతల: నిండు విశ్వాసంతో ప్రార్థిస్తే కష్టాలు దూరం అవుతాయని కడప పీఠం అపోస్తలిక పాలనాధికారి డాక్టర్ గాలిబాలి అన్నారు. ఏసుక్రీస్తును సమస్త మానవాళిని రక్షించుటకు యెహోవాకు కానుకగా కన్య మరియ సమర్పించిందని పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కానుకమాత చర్చి విచారణ గురువులు రె. ఫాదర్ యేరువ లూర్దుమ రెడ్డి నేతృత్వంలో గుంటూరు పీఠాధిపతులు చిన్నాబత్తిని భాగ్యయ్య, నల్గొండ పీఠం విశ్రాంత పీఠాధిపతులు మోస్ట్ రెవ.గోవిందు జోజి, ఫాదర్లతో కలిసి కానుకమాత చర్చి 175వ తిరునాళ్ల మహోత్సవ సమష్టి దివ్యపూజాబలిలో భక్తులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఏసు ప్రభువులోని మహిమ, తేజస్సును విశ్వాస దృష్టితోనే చూడగలమన్నారు. కతోలికులు క్రీస్తు సూక్తులను ఆచరిస్తూ ఇతరుల పట్ల ప్రేమ, దయ, కరుణ చూపుతూ జీవించాలన్నారు. ప్రస్తుత సమాజంలో నెలకొన్న సమస్యలకు శాంతి సమాధానాలే పరిష్కార మార్గాలని తెలిపారు. పలు ప్రాంతాలకు చెందిన 74 మంది గురువులు, 53 మంది మఠకన్యలు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ గాలిబాలి, భాగ్యయ్య, గోవిందు జోజిలను ఘనంగా సన్మానించారు. సాయంత్రం 4 గంటల నుంచి కానుకమాతకు కొవ్వొత్తులను సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. గురజాల డీఎస్పీ జగదీష్ పర్యవేక్షణలో ఎస్ఐ సీహెచ్ నాగార్జున బందోబస్తు ఏర్పాటు చేశారు.



దివ్యపూజాబలిని సమర్పిస్తున్న డాక్టర్ గాలిబాలి, చిన్నాబత్తిని భాగ్యయ్య, గోవిందు జోజి

పడగ దించిన కుష్ఠు వ్యాధి

- తగ్గుతున్న కేసులు
- ఎల్‌సీడీసీ సర్వేలో వెల్లడి
- తాజాగా 'స్పర్శ' ఆరంభం
- వ్యాధిపై ప్రజలకు అవగాహన సదస్సుల నిర్వహణ



దుగ్గిరాలలో ఆశా వర్కర్ల సర్వే

తెనాలి: కుష్ఠు వ్యాధి నిర్మూలనలో రాష్ట్రంలో గణనీయమైన ప్రగతి కనిపిస్తోంది. ఏటికేడాది విస్తరిస్తూ వస్తున్న వ్యాధి గత నాలుగేళ్లుగా తగ్గిపోతుండటం ఇందుకు నిదర్శనం. ఇదే క్రమంలో తెనాలి ప్రాంతంలోనూ వ్యాధి పీడితుల నమోదు తగ్గింది. కార్యాచరణను ఇలాగే కొనసాగిస్తే, నిర్మూలనకు అవకాశం ఉంటుందన్న ఆశాభావం కనిపిస్తోంది. ప్రస్తుతం జరుగుతున్న లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపైన్ (ఎల్‌సీడీసీ)లోనూ కేసుల సంఖ్య బాగా తక్కువగా కనిపిస్తోంది. తాజాగా మహాత్మాగాంధీ వర్థంతి రోజైన గత నెల 30వ తేదీ నుంచి 'స్పర్శ' ఆరంభమైంది. ఇందులో భాగంగా వ్యాధిపై ప్రజలకు అవగాహన సదస్సులతో పాటు సర్వే కూడా చేస్తారు.

జిల్లాలోనూ 800 కేసులు

2018 నాటికి దేశంలో కుష్ఠు వ్యాధిని నిర్మూలిస్తామని నాటి కేంద్ర ఆర్థికమంత్రి పార్లమెంటులో చేసిన ప్రకటనకు భిన్నంగా వాస్తవ గణంకాలు వెలుగుచూశాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఐదు వేలకు పైగా కేసులు నమోదయ్యాయి. గుంటూరు జిల్లాలోనూ దాదాపు 800 పైచిలుకు వెలుగుచూశాయి. దీంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకున్న చర్యలు, వ్యాధిగ్రస్తుల సర్వేలో ప్రత్యేక యాప్‌తో ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ విధానంతో ఆశాజనకమైన ఫలితాలు వచ్చాయి. ఏటా కేసుల సంఖ్య గణనీయంగా తగ్గుతూ వచ్చింది. తాజాగా జరుగుతున్న ఎల్‌సీడీసీ సర్వేలోనూ కేసులు తగ్గుముఖం పట్టిన దాఖలాలు కనిపించాయి. తెనాలి యూనిట్ పరిధిలో (కొలకలూరు, ఈమని, దుగ్గిరాల, మున్నంగి పీహెచ్‌సీలు) 2022–23లో 27 కేసులు, 2023–24లో 28 కేసులు రాగా, 2024–25లో ఇప్పటివరకు కేవలం 25 కేసులే ఉన్నాయి. మరో 83 మందిని అనుమానితులుగా గుర్తించారు. వీరిని మరోసారి సంబంధిత అధికారులు పరీక్షించి వ్యాధి నిర్ధారణ అయితే చికిత్స చేస్తారు. గజ్జి, తామర, సోబి, నల్లమంగు, విటమిన్ లోపంతో వచ్చే మచ్చలైతే అవసరమైతే మందులు ఇస్తామని డెప్యూటీ పారామెడికల్ అధికారి జె.శ్యామ్ వెల్లడించారు.

బాక్టీరియా క్రిమి కారణం

'లెప్రే బ్రాసిలే' అనే బాక్టీరియా క్రిమి కారణంగా కుష్ఠు వ్యాధి సంక్రమిస్తుంది. క్షయ వ్యాధికారక క్రిమి కూడా ఈ తరహాకు చెందినదే. ఈ రెండింటినీ అక్కాచెల్లెళ్లుగా చెబుతుంటారు. క్రిమి మనిషి శరీరంలోకి ప్రవేశించాక, వ్యాధి బయటపడేందుకు, సంబంధిత మనిషిలోని రోగనిరోధక శక్తి ఆధారంగా ఐదు నుంచి 30 సంవత్సరాలు పట్టొచ్చు. శరీరంపై తెల్లమచ్చలతో వ్యాధి లక్షణాలు మొదలవుతాయి. చేతులు, కాలివేళ్లు, మూతివంకర్లు పోవడం నుంచి పుండ్లు ఏర్పడి, వేళ్లు కోల్పోవటం వరకు తీవ్రత ఉంటుంది. చివరకు అంగవైకల్యానికి దారితీస్తుంది.

అందుబాటులోకి ప్రత్యేక యాప్

జిల్లా కేంద్రంలో ఓ యూనిట్‌ను ఉంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అనుసంధానం చేశారు. కుష్ఠు వ్యాధి కేసును ఇతర సంస్థలు గుర్తించినా, పీహెచ్‌సీకి అప్పగించాల్సిందే. దీంతోపాటు జాతీయ కుష్ఠునిర్మూలన కార్యక్రమం–ఏపీ పేరుతో రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను 2020లో అందుబాటులోకి తెచ్చింది. ఈ విధానంలో దేశవ్యాప్తంగా జరుగుతున్న సర్వేలో ముందుగా ఆఫ్‌లైన్‌లో చేసి, వివరాలను ఆన్‌లైన్ చేసేవారు. ఇందుకు భిన్నంగా రాష్ట్రంలో ప్రత్యేక యాప్‌తో నేరుగా ఒకేసారి ఆన్‌లైన్‌లో సర్వే నిర్వహించడం మొదలుపెట్టారు. నేడు అదే విధానం కొనసాగుతోంది.

సంజీవనిలా ఎండీటీ చికిత్స

ప్రపంచ ఆరోగ్య సంస్థతో చేసుకున్న ఒప్పందం ప్రకారం కేంద్ర ప్రభుత్వం 1980లో దేశవ్యాప్తంగా కుష్ఠు నిర్మూలనను చేపట్టింది. మురికివాడలు సహా ఇంటింటి సర్వే చేసింది. లక్షణాలు కనిపిస్తే నమోదు చేసుకుని అక్కడే 'మోనోథెరపీ' అనే మందును ఇచ్చేవారు. దీని స్థానంలో 1986లో బహుళ మందుల చికిత్స (ఎండీటీ) విధానం సంజీవనిలా వచ్చింది. ప్రభుత్వ లెప్రసీ యూనిట్లు, మోరంపూడి వద్ద గల గ్రైటనాల్డ్స్ వంటి సంస్థలు ఇందులో చురుకుగా పనిచేశాయి. 2003 నాటికి వ్యాధి నిర్మూలన జరిగిందనీ, 10 వేలమందికి ఒకరు కూడా బాధితులు లేరనే భావనతో ప్రభుత్వం కార్యాచరణను తగ్గించింది.



వాడరేవు తీరం ఒడ్డున విక్రయిస్తున్న సముద్ర పీతలు



అమ్మకానికి సిద్ధంగా..



వేటలో లభ్యమైన పలు రకాల చేపలు

వల నిండగా.. ఆనందం పండగా..

కొద్దిరోజులుగా సముద్రంలో తక్కువగా లభించిన మత్స్య సంపద ఆదివారం అదరగొట్టింది. శుక్ర, శనివారాల్లో వేటకు వెళ్లిన వాడరేవు మత్స్యకారులకు అధిక మొత్తంలో చేపలు, రొయ్యలు, పీతలు చిక్కడంతో ఆనందం వ్యక్తం చేశారు. మత్స్యకారులు గంగమ్మ తల్లికి పూజలు నిర్వహించి చేపల వేటకు వెళ్లి ఆదివారం ఉదయానికి తీరం చేరుకున్నారు. రొయ్యలు, సొర, వంజరం, పండుగప్ప, తోక చేపలు, గురకలు, సూర వంటి చేపలు లభించాయి. దీంతో తీరం ఒడ్డు కిటకిటలాడింది. వీటిని చెన్నై, కోల్‌కతా, మైసూరు, బెంగళూరు, హైదరాబాద్ వంటి ముఖ్య ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. మత్స్య సంపదను తీరం ఒడ్డునే వేలం పాటలో విక్రయించి మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేశారు.

– చీరాల టౌన్

క్లుప్తంగా

వదంతులతో యువకుడి దేహశుద్ధి..



వినుకొండ(నూజెండ్ల): పిల్లలను అపహరించేందుకు ప్రయత్నిస్తున్నాడనే అనుమానంతో పట్టణంలోని బోసుబొమ్మ సెంటరులో యువకుడిని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఆదివారం మధ్యాహ్నం సమయంలో ఇసుకవాగు వద్ద అనుమానాస్పదంగా తిరుగుతూ చిన్నపిల్లల వద్దకు రావటంతో వెంటనే స్పందించిన స్థానికులు అతడిని పట్టుకున్నారు. ఎలాంటి సమాధానం చెప్పకపోవటంతో పోలీసులకు అప్పగించారు. విచారణ అనంతరం సదరు వ్యక్తి మానసిక పరిస్థితి గమనించిన పోలీసులు మతిస్థిమితం లేనివ్యక్తిగా గుర్తించి వదలివేశారు. ఎవరైయినా అనుమానాస్పదంగా కన్పిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

కాలువలోపడి యువకుడు మృతి



అచ్చంపేట: యువకుడు కాలువలో పడి మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. మండలంలోని వేల్పూరుకు చెందిన యువకుడు ఆవుల నాగేశ్వరరావు(34) సాయంత్రం 4 గంటల సమయంలో బైకుపై వేల్పూరు నుంచి క్రోసూరు వెళుతున్నాడు. మద్యం తాగి బైకు వేగంగా నడపడం వలనే రోడ్డుపక్కన ఉన్న కాలువలో పడినట్లు స్థానికులు చెబుతున్నారు. భార్య, ఇరువురు కుమారులు ఉన్నారు.

ఏబీసీ కెనాలో మృతదేహం లభ్యం

శావల్యాపురం: మండలంలోని గంటావారిపాలెం గ్రామ సమీపంలో అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధిలో మృతదేహం లభ్యమైంది. ఎస్సై లేళ్ల లోకేశ్వరరావు తెలిపిన వివరాలు.. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం అనంతపల్లి గ్రామానికి చెందిన మండ్ల రాజేష్ (25) 10 ఏళ్ల కిందట ఇంటి నుంచి బయటకు వచ్చాడు. ఈక్రమంలో వినుకొండ పట్టణంలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. చెడు వ్యసనాలకు బానిసై ఒంటరిగానే జీవనంగా కొనసాగిస్తున్నట్లు కుటుంబ సభ్యులు, సహచర కూలీలు తెలిపినట్లు ఎస్సై తెలిపారు. ఈ క్రమంలో కాల్వలో మృతదేహం దొరికిందన్నారు. విషయాన్ని మృతుడు కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, అనంతరం మృతదేహన్ని కుటుంబసభ్యులకు అప్పగిస్తామని ఎస్ఐ తెలిపారు.

సాగులో సాంకేతిక సురేఖ!

వ్యవసాయరంగంలో సాంకేతికత పెరగడంతో ఆ రంగం అభివృద్ధి పథాన సాగుతోంది.
ఈ మార్పులో మహిళలు ప్రధాన భూమిక పోషిస్తున్నారు.
ఈ కోవలోనే నాదెండ్ల మండలం అప్పాపురం గ్రామానికి చెందిన సురేఖ డ్రోన్ పిచికారీలో తన ప్రతిభను చూపిస్తూ అన్నదాతలకు ఆధునిక సాంకేతిక సేవల్ని అందిస్తున్నారు.



డ్రోన్ ట్యాంకులో మందు నింపి గాల్లోకి డ్రైవ్ చేస్తున్న సురేఖ

- వ్యవసాయ రంగంలో డ్రోన్ సేవలందిస్తున్న జిల్లా మహిళ
- 'నమో డ్రోన్ దీదీ పథకం' కింద పైలట్ శిక్షణ పూర్తి
- రాష్ట్రంలో రూ.16.30 లక్షల మేరకు లబ్ధి పొందిన ఏకైక అతివ

యడ్లపాడు/నాదెండ్ల: కేంద్ర ప్రభుత్వం మహిళాభ్యుదయానికి ఇటీవల ఆవిష్కరించిన 'నమో దీదీ డ్రోన్ పథకం' పొందేందుకు ఏపీ నుంచి ఎందరో పోటీ పడ్డారు. వంద శాతం సబ్సిడీతో పథకం పొంది డ్రోన్ పైలెట్ శిక్షణ పూర్తి చేసుకున్న ఏకైక మహిళ సురేఖ మాత్రమే కావడం విశేషం. ఈ పథకం ద్వారా రూ.8 లక్షల విలువైన అత్యాధునిక డ్రోన్, ఇండియన్ ఫార్మర్స్ ఫెర్టిలైజర్ కోఆపరేటివ్ లిమిటెడ్ (ఇఫ్కో) ద్వారా రూ.5.50 లక్షల విలువైన ఆటో, బ్యాటరీల చార్జింగ్ నిమిత్తం అవసరమయ్యే రూ.2.80 లక్షల జనరేటర్‌ను ఉచితంగా పొందారు. ప్రైవేటు వ్యక్తులు డ్రోన్ సేవలకు ఎకరాకు రూ.450 నుంచి రూ.600 వసూలు చేస్తుండగా, సురేఖ మాత్రం రూ.300కు మించి వసూలు చేయడం లేదు. ఈ పథకం కేవలం డ్వాక్రా మహిళలకు మాత్రమే వర్తిస్తుంది.

ఎకరానికి 7 నిమిషాలే

సురేఖను భర్త కల్లూరి కిషోర్ ఉదయాన్నే ఆటోలో క్షేత్రాలకు తీసుకెళ్లి సాయంత్రం వరకు డ్రోన్ వినియోగంలో సహకరిస్తూ ప్రొత్సహిస్తున్నారు. పథకం లక్ష్యం, కలిగే ప్రయోజనాలను ఆయా గ్రామాలకు వెళ్లినప్పుడు రైతులకు వివరిస్తున్నారు. సురేఖది రైతు కుటుంబం కావడంతో చిన్ననాటి నుంచి సాగు కష్టాలపై అవగాహన ఉంది. ఎంబీఏ చదవడం వల్ల సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు కలిగింది. దీంతో సాగులో డ్రోన్ టెక్నాలజీని సమర్థంగా ఒడిసిపట్టుకున్నారు. గ్రామంలో వీరికి ఫర్టిలైజర్ షాపు ఉండటం కలిసి వచ్చింది. సాధారణ గన్‌తో లీటర్ మందు పిచికారీకి సుమారు 140 లీటర్ల నీరు అవసరం. డ్రోన్ ద్వారా కేవలం 9 లీటర్లు సరిపోతుంది. దీంతో మందు ప్రభావం మొక్కపై సరిగ్గా ఉంటుంది. ఎకరా విస్తీర్ణంలో 7 నిమిషాల్లో పూర్తి అవుతోంది. ఇలా రోజుకు దాదాపు 30 ఎకరాలకు పిచికారీ చేస్తున్నారు.

ఎన్నో ప్రయోజనాలు

తక్కువ సమయంలో ఎక్కువ ఎకరాల్లో మందులు పిచికారీ చేయడం వీలవుతోంది. వనరులు, సమయం, నీరు ఆదా వంటి ప్రయోజనాలు ఉన్నాయి. కూలీలైతే మందు చల్లే సమయంలో గాలికి ముఖం, కాళ్లు, చేతులపై మందు పడి పలు అనారోగ్య సమస్యలు వాటిల్లేవి. డ్రోన్‌తో ఆ ఇబ్బంది ఉండదు. కూలీల కొరత సమస్య తీరింది.

రైతులకు మంచి సేవలే లక్ష్యం



వ్యవసాయంపై , పురుగు మందులపై, సాంకేతిక పరిజ్ఞానంపైనా పట్టు ఉండటంతో నాలుగు రాష్ట్రాలకు చెందిన 20 మంది మహిళలతో పాటు నేను కూడా ఈ పథకంలో ఎంపికయ్యాను. ఆరు నెలల పైలట్ శిక్షణ పొందా. రైతాంగానికి మంచి సేవలు అందించడమే లక్ష్యం. గతేడాది జూలై నుంచి ఇప్పటి వరకు 650 ఎకరాల్లో మా డ్రోన్ సేవలు అందించాం. రాష్ట్రవ్యాప్తంగా సేవలు అందుబాటులో ఉంటాయి.

– కె.సురేఖ, డ్రోన్ పైలట్

ఎంతో ప్రయోజనకరం



తాతల కలం నుంచి వ్యవసాయాన్నే నమ్ముకున్నాం. డ్రోన్ ద్వారా మందు పిచికారీ చేస్తే కేవలం మొక్కపై మాత్రమే పడుతోంది. ముఖ్యంగా కూలీల కొరత సమస్య తీరింది. ఈ పథకం రైతులకు ఎంతో ప్రయోజనకరం.

– డి.సాంబశివరావు, రైతు, గణేశునివారిపాలెం

చికిత్స పొందుతూ కానిస్టేబుల్ మృతి



యడ్లపాడు: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ కానిస్టేబుల్ ఆదివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గుంటూరు జిల్లా నుంచి ప్రకాశం జిల్లా దొనకొండకు వెళ్తున్న ఇన్నోవా కారు గతనెల 20వ తేదీన తెల్లవారుజామున అదుపుతప్పింది. యడ్లపాడు మండలం తిమ్మాపురం వద్ద హైవేపై చోటుచేసుకున్న ఈ ప్రమాదంలో కారు ముందుభాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. ప్రకాశం జిల్లా మండల కేంద్రమైన గిద్దలూరు నల్లబండ్ల బజారుకు చెందిన సింగిశెట్టి బాలఉగ్రకు తీవ్రంగా, వెనుక ఉన్న నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. బాలఉగ్రను 108లో గుంటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. బాలఉగ్ర ప్రకాశం జిల్లా దొనకొండ పోలీస్‌స్టేషన్‌లో 2011 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అతడికి భార్య మంజులాదేవి, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు యడ్లపాడు ఎస్ఐ వి.బాలకృష్ణ తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగులకు వెంటనే పదోన్నతులు ఇవ్వాలి

ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు

పిడుగురాళ్ల: ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం అనంతరం మారిన నిబంధనల మేరకు పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు వెంటనే కల్పించాలని ఎంప్లాయీస్ యూనియన్(ఈయూ) రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు డిమాండ్ చేశారు. పిడుగురాళ్ల పట్టణంలోని ఎస్టీయూ కార్యాలయంలో పల్నాడు జిల్లా ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి జీటీ రావు ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు ఎస్‌కే ఖాజా అధ్యక్షతన నిర్వహించారు. దామోదరరావు మాట్లాడుతూ పదోన్నతులు క్లాస్–4 ఉద్యోగి నుంచి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వరకు పలు క్యాటగిరిలకు సంబంధించి సుమారు మూడు వేల మందికి రావాల్సి ఉందన్నారు. ఈవిషయమై ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావును, రవాణాశాఖ మంత్రిని కలిసి పలుమార్లు విజ్ఞప్తి చేశామని తెలిపారు. ఇప్పటికీ పదోన్నతులపై స్పష్టత ఇవ్వకుండా జాప్యం చేస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకొని ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మందపాటి శంకరరావు, కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జోనల్ నాయకులు కె.హరిబాబు, నాయకులు ఎస్‌కే దస్తగిరి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్‌కే ఆసిఫ్‌తోపాటు ఏపీజేఏసీ అమరావతి ఉమెన్ కమిటీ నరసరావుపేట డివిజన్ చైర్‌పర్సన్ ఎస్‌కే దిల్‌షాద్ బేగం, స్టేట్ మెయింటినెన్స్ కమిటీ మెంబర్ గణపవరం శ్రీనివాసరావు, పిడుగురాళ్ల డిపో కార్యదర్శి బంగారం శ్రీనివాసరావు, ఆరు డిపోల అధ్యక్ష, కార్యదర్శులు, జిల్లా కమిటీ, గ్యారేజ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు పిడుగురాళ్ల మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక

వైఎస్సార్ సీపీ మళ్లీ అవకాశం

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ఎన్నిక సోమవారం నిర్వహించనున్నారు. పిడుగురాళ్ల మున్సిపాలిటీలో 33 వార్డులు ఉండగా మొత్తం వార్డులను గతంలో వైఎస్సార్ సీపీ కైవసం చేసుకుంది. సార్వత్రిక ఎన్నికల అనంతరం వైఎస్సార్ సీపీలో నుంచి ఒక కౌన్సిలర్ టీడీపీలోకి వెళ్లారు. అయితే గతంలో ఇద్దరు మున్సిపల్ వైస్ చైర్మన్‌లు కొమ్ము ముక్కంటి, షేక్ జైలాబ్దిన్ ఉన్నారు. గత ఏడాది కొమ్ము ముక్కంటి మృతి చెందడంతో మున్సిపల్ వైస్ చైర్మన్ పదవి ఖాళీగా ఉంది. దీంతో రాష్ట్ర ఎన్నికల కమిషన్ 3వ తేదీన ఎన్నిక నిర్వహించాలని ఆదేశాలు జారీ చేయటంతో సోమవారం ఎన్నిక ప్రక్రియ కొనసాగనుంది. అయితే 32 మంది కౌన్సిలర్లు ఉన్న వైఎస్సార్ సీపీనే మున్సిపల్ వైస్ చైర్మన్ సీటును దక్కించుకునే అవకాశం బలంగా ఉంది. 32 కౌన్సిలర్లు వైఎస్సార్ సీపీ వైపు ఉండటంతో కూటమి కూడా వైస్ చైర్మన్ సీటుపై దృష్టి సారించలేకపోయింది. నేడు జరగబోయే ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు అన్ని పూర్తయినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.

వైభవంగా గీతా యజ్ఞం కోటి మహోత్సవం

- ప్రత్యేక పూజలు
- 50 వేల మందికి పైగా అన్నదానం
- భారీ స్థాయిలో పాల్గొన్న భక్తులు



సందేశమిస్తున్న కాశీ విశ్వనాథ స్వామి, వేదికపై ఎమ్మెల్యే జేబీఆర్



కోటి నామోత్సవానికి హాజరైన భక్తులు

మాచర్ల: భగవాన్ గీతా యజ్ఞ కార్యక్రమం, కోటి మహోత్సవం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని గుంటూరు రోడ్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమం వద్దకు ఆదివారం తెల్లవారుజాము నుంచి భక్తులు తరలివచ్చారు. స్వామీజీలు, మాతాజీలు, పీఠాధిపతులు భారీ స్థాయిలో తరలివచ్చి పరబ్రహ్మ కాశీ విశ్వనాథ స్వామి ఆధ్వర్యంలో భగవాన్ గీతా యజ్ఞం నిర్వహించారు. పరబ్రహ్మశ్రీ మాట్లాడుతూ రాబోయే ఏప్రిల్‌లో అయోధ్య రామాలయం సమీపంలో లక్షలాది మందితో స్వామికి 24 కిలోల పాదాలు అందించనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ హైందవ మతాన్ని కాపాడేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో గీతా గురూజీ పందిరి శ్రీశైలం, మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, నూరె యలమంద, కంభంపాటి అనిల్ కుమార్, నియోజక వర్గ బీసీ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు పంగులూరి అంజయ్య, కొమెర దుర్గారావు, శ్రీ వాసవీ కన్యక పరమేశ్వరి అమ్మవారి ఆలయ అధ్యక్షులు భవనాశి వెంకటేశ్వర్లు, శ్రీ రామాలయం అధ్యక్షులు బచ్చు రామారావు పాల్గొన్నారు. సుమారు 50 వేల మందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పలువురు దంపతుల ఆధ్వర్యంలో పూర్ణాహుతి, యజ్ఞం కార్యక్రమాలు నిర్వహించారు.

దేశ సంపద ఒంగోలు జాతి ఎడ్లు

- ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు
- నాదెండ్లలో జాతీయస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు ప్రారంభం



ఎడ్ల పోటీలకు హాజరైన వారికి జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

నాదెండ్ల: ఒంగోలు జాతి ఎడ్లు భారతదేశానికి గొప్ప సంపదని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. నాదెండ్ల- గణపవరం డొంక రోడ్డులోని నందికుంట విఘ్నేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం జాతీయస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నిత్యం వ్యవసాయ పనులతో తీరిక లేకుండా గడిపే రైతులు, రైతు కూలీలు గ్రామాల్లో జరిగే కొన్ని ప్రత్యేక కార్యక్రమాల్లో కుటుంబ సభ్యులు, బంధువులతో కలసి సంతోషంగా గడపటం ఆనందదాయకమన్నారు. ఎడ్లు, కోళ్ల పందేలు మన సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పడతాయని చెప్పారు. ఒంగోలు జాతి ఎడ్లు తరిగిపోతున్న క్రమంలో పలువురు పశుపోషకులు వ్యయప్రయాసలకోర్చి వీటిని పెంచటం అభినందనీయమన్నారు. ఒంగోలు జాతి గిత్తలు రాజసం, పౌరుషాలకు పెట్టింది పేరుగా కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ నెల్లూరి సదాశివరావు, నాయకులు షేక్ కరిముల్లా, జవ్వాజి మదన్ మోహన్, కామినేని సాయిబాబు, హరిబాబు పాల్గొన్నారు.

తొలిరోజు 11 ఎడ్ల జతలు...

పోటీలు ప్రారంభమైన తొలిరోజు రెండు పళ్ల విభాగంలో పదకొండు జతల ఎడ్లు పాల్గొన్నాయి. 7.40 క్వింటాళ్ల బండను సత్తెనపల్లి మండలం కంటెపూడి గ్రామానికి చెందిన మున్నంగి వీరగోపాలరెడ్డికి చెందిన ఎడ్ల జత 1757 అడుగుల దూరం లాగింది. నరసరావుపేట మండలం ఇస్సపాలెం గ్రామానికి చెందిన జెల్లి నాగమల్లేశ్వరరావు, క్రోసూరు మండలం త్యాళ్లూరు గ్రామానికి చెందిన మలిశెట్టి ప్రేమకుమార్‌లకు చెందిన జత 2,508 అడుగుల దూరం లాగింది. ఇంకొల్లు మండలం, పూసపాడు గ్రామానికి చెందిన సూరిబ్రదర్స్ జత 2235 అడుగల దూరం లాగింది. పోటీలు రాత్రి వరకూ కొనసాగాయి. సోమవారం నాలుగు పళ్ల విభాగంలో పోటీలు నిర్వహించనున్నారు.

పీడీఎఫ్ అభ్యర్థికి మద్దతు ఇవ్వండి

నరసరావుపేట: ఈ నెల 27న జరగనున్న ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో ప్రజా, కార్మిక, కర్షక, చిరు ఉద్యోగుల గొంతుక పీడీఎఫ్ అభ్యర్థి, ఎమ్మెల్సీ కేఎస్.లక్ష్మణరావు గెలుపునకు ప్రజా సంఘాలతో కలిసి యూటీఎఫ్ విస్తృతంగా పని చేయాలని రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ టీఎస్ఎస్ఎల్ మల్లేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక జిల్లా కార్యాలయంలో జిల్లా విస్తృత కార్యవర్గ జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. యూటీఎఫ్ ప్రచురణల కమిటీ చైర్మన్ హనుమంతరావు మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పరిధిలో 3,46,686 పట్టభద్రుల ఓటర్లు ఉండగా పల్నాడు జిల్లాలో 73 పోలింగ్ కేంద్రాల పరిధిలో 56,900 మంది పట్టభద్రులు ఉన్నారన్నారు. గత ఎన్నికల పోలింగ్ సరళి పరిశీలిస్తే 65 శాతం మించి పోలింగ్ జరిగే పరిస్థితి లేదని, ప్రస్తుత ఓటర్ల సంఖ్య పోలింగ్ సరళి పరిశీలిస్తే 1.20 లక్షల మంది కంటే ఎక్కువ మంది ఓటు హక్కు వినియోగించుకునేందుకు ముందుకు రావడంలేదని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.మోహనరావు, జిల్లా గౌరవాధ్యక్షులు షేక్ ఖాసీం పీరా, కోశాధికారి రవిబాబు, రాష్ట్ర ఆడిటర్ కమిటీ సభ్యులు పి ప్రేమ్‌కుమార్, యూటీఎఫ్ బాధ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యారంగంపై నిరాశజనకంగా బడ్జెట్

యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు పి.ప్రేమ్‌కుమార్

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వార్షిక బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తూ నిరాశజనకంగా ఉందని, ప్రధానంగా విద్యారంగానికి కేటాయింపులు దారుణంగా ఉన్నాయని యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు పి.ప్రేమ్‌కుమార్ విమర్శించారు. యూజీసీ, ఎల్ఐసీలలో కూడా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు తలుపులు తెరవడం తగదన్నారు. యూనివర్సిటీలను బలోపేతం చేసేందుకు ఎటువంటి చర్యలు బడ్జెట్‌లో లేవని అన్నారు. బీహార్, ఢిల్లీ రాష్ట్రాలలో జరగనున్న ఎన్నికల దృష్ట్యా బడ్జెట్ ప్రకటించినట్టుగా అనిపిస్తుందని, రెండు తెలుగు రాష్ట్రాలకు తీరని అన్యాయం చేసిందని బడ్జెట్‌ను బట్టి అర్థమవుతుందన్నారు. ఈ బడ్జెట్ వేతన జీవులకు అనుకూలంగా లేదని, ఎన్నికలు ఉన్న రాష్ట్రాలకే వరాల బడ్జెట్‌గా మారిందన్నారు.

ముద్రగడ ఇంటిపై దాడి హేయం

రాష్ట్ర కాపు యువసేన అధ్యక్షులు కర్హా శ్రీనివాసరావు

శావల్యాపురం: కాపు ఉద్యమనేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఇంటిపై జనసేన కార్యకర్త గనిశెట్టి గంగాధర్ ట్రాక్టరుతో గేట్లు గుద్దుకుంటూ లోపలికి వెళ్లి కారును ధ్వంసం చేసి దాడి హేయమని ఆంధ్రప్రదేశ్ యువసేన అధ్యక్షుడు కర్హా శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దాడులకు పాల్పడివారిపై చట్టపరంగా కేసులు నమోదు చేయటంతో పాటు జనసేన పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ముద్రగడ పద్మనాభంకు ఏమైనా జరిగితే ప్రభుత్వామే బాధ్యత వహించాలని కోరారు. ఎన్నికల సమయంలో కాపు కార్పొరేషన్ ద్వారా ఐదు సంవత్సరాల పాలనలో రూ.15 వేల కోట్లు నిధులు కేటాయించి కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాలకు చెందిన వారి అభ్యున్నతికి పాటుపడుతామని ఓట్లు వేయించుకొని నేటి వరకు ఏలాంటి పథకాలు అమలు చేయకపోవటం ప్రభుత్వ తీరుకు నిదర్శమన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో అర్హులైన కాపు మహిళలకు ప్రతి ఏటా రూ.15 వేలు వారి బ్యాంకు ఖాతాలో జమ చేసినట్లు గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం కాపులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే భవిష్యత్‌లో తగిన గుణపాఠం చెబుతారన్నారు.

క్రీడా పోటీలతోనే ప్రతిభ వెలుగులోకి



ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

- జిల్లాకు క్రీడాకారులు పేరు తీసుకురావాలి
- వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సయ్యద్ పెద్ద కరిముల్లా
- సత్తెనపల్లిలో జిల్లాస్థాయి ఫుట్‌బాల్ సెలక్షన్ ట్రయల్స్

సత్తెనపల్లి: ఏ ఆటలోనైనా గెలుపోటములు సహజమని .. ఓడిన వారు కుంగిపోకుండా గెలిచిన వారిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సయ్యద్ పెద్ద కరిముల్లా అన్నారు. పట్టణంలోని సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో పల్నాడు జిల్లా స్థాయి సీనియర్ మెన్ ఫుట్‌బాల్ సెలక్షన్ ట్రయల్స్ ఆదివారం జరిగాయి. ఈ సెలక్షన్‌కు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి 50 మంది క్రీడాకారులు హాజరయ్యారు. పెద్దకరిముల్లా మాట్లాడుతూ జిల్లా జట్టుకు సెలెక్ట్ అయిన క్రీడాకారులు పల్నాడు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు సయ్యద్ పెద్దకరిముల్లాతో పాటు అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు జాన్‌బాబు, శ్రీనివాసరావు, రాంబో బుడే, నాగులుమీరా, గౌస్, ఉమర్, రఫీ, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు వెంకటాద్రి, పీడీలు ఏ శ్రీరామ్‌రెడ్డి, డి శ్రీనివాసరావు, అచ్చిరెడ్డి, నరసింహారావు, వెంకటేష్ రెడ్డి, రియాజ్, రిటైర్డ్ పీడీ ఐఎస్ నాగిరెడ్డి, నాని, పాల్గొన్నారు. జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.సుబ్రహ్మణ్యేశ్వరరావు ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా మెన్ ప్రాబల్‌బుల్స్ సెలెక్ట్ అయిన క్రీడాకారులకు ఈ నెల 3 నుంచి 9 వరకు ప్రతిరోజూ సాయంత్రం 4:30 నుంచి 6:30 వరకు కోచింగ్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు.

జిల్లాస్థాయి మెన్ ఫుట్‌బాల్ ప్రాబల్‌బుల్స్‌కు ఎంపికైన క్రీడాకారులు

షేక్ ఇర్ఫాన్ (నరసరావుపేట), కె.నరేష్ (మాదల), కె.శ్రీనివాసరావు(మాదల), చింతలపూడి రాజు (మాదల), సిహెచ్ రాజు (మాదల), కొత్తపల్లి శ్యామ్ (మాదల), జి ప్రదీప్ (మాదల), కె.ప్రవీణ్ కుమార్ (మాదల), టీ.కళ్యాణ్‌రామ్ (మాదల), ఎం వరుణ్(ఇరుకుపాలెం), పి.హుస్సేన్(సత్తెనపల్లి),పి.శివమణి(సత్తెనపల్లి), పి.రవికుమార్ (సత్తెనపల్లి), టీ.మోహన్‌వెంకటదీపక్ (సత్తెనపల్లి), కె.ఆకాష్(సత్తెనపల్లి), ఎన్‌టీ.రఫీ (సత్తెనపల్లి), పీహెచ్.రాజు(సత్తెనపల్లి), జి.యశ్వంత్ (సత్తెనపల్లి), ఎస్ వీరాంజనే యులు(సత్తెనపల్లి), కె.ఇసాక్(నరసరావుపేట), పి.విజయసాయి(నరసరావుపేట), పి.ధర్మతేజ(నరసరావుపేట), సుధాకర్(నరసరావుపేట), షేక్.షరీఫ్ (నరసరావు పేట), ఎం ముఖేష్(నరసరావుపేట), జె.శివశంకర్(నరసరావుపేట), వై.రామ కోటిరెడ్డి (సత్తెనపల్లి) లు ఉన్నారు.

విధ్వంసం కేసులో నిందితుడి బంధువులు రాస్తారోకో

సంబంధలేని కేసులో ఇరికించారంటూ ఆవేదన



ధర్నా చేస్తున్న దృశ్యం

క్రోసూరు: స్థానిక శ్రీకల్యాణవెంకటేశ్వరస్వామి ఆలయంలో క్రోసూరులోని శుక్రవారం రాత్రి చోటుచేసుకున్న విధ్వంసం ఘటనలో పోలీసులు అదుపులోకి తీసుకున్న వాసం నాగరాజు కుటుంబ సభ్యులు, బంధువులు ఆదివారం రాత్రి బోర్డు స్కూల్ వద్ద రాస్తారోకో చేపట్టారు. ఘటనకు ఎలాంటి సంబంధం లేకుండానే కేసులో ఇరికించారని ఆరోపించారు. ఆందోళకారులతో సీఐ సురేష్, ఎస్.నాగేంద్రరావు చర్చలు జరిపారు. పోలీసుల అదుపులో ఉన్న నిందితుడితో మాట్లాడిస్తామని, రాస్తారోకో విరమించాలని సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు.

కాలువలోకి దూసుకెళ్లిన కారు

ఫిరంగిపురం: ప్రమాదవశాత్తు అదుపుతప్పి కారు పంట కాలువలోకి దూసుకెళ్లిన సంఘటన మండలంలోని వేమవరం గ్రామ శివారులో ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. రాజమండ్రికి చెందిన ఓ కుటుంబం కారులో శ్రీశైలం వెళ్లి తిరిగి వస్తోంది. వేమవరం గ్రామ శివారులో రహదారి మార్జిన్ దిగడంతో అదుపు తప్పి పంట కాలువలోకి దూసుకెళ్లింది. బెలూన్‌లు తెరుచుకోవడంతో ఎవరికీ ప్రమాదం జరగలేదని కారు యజమాని పి.రాంబాబు తెలిపారు. మరో వాహన సాయంతో కారును రోడ్డు పైకి తెచ్చారు.